ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నంద్యాల
జిల్లా వార్తలు
మంగళవారం 8 అక్టోబరు 2024




స్కందమాతగా భ్రామరి




శరన్నవరాత్రి వేడుకలను వీక్షిస్తున్న భక్తులు



- శేష వాహనంపై విహరించిన ఆది దంపతులు
- కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి వేడుకలు

శ్రీశైలం, అక్టోబరు 7: శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. ఐదో రోజైన సోమవారం భ్రమరాంబికాదేవి స్కందమాతగా భక్తులను అనుగ్రహించారు. స్కందమాతగా ఆశీనురాలై చతుర్భుజాలు కలిగి పద్మం, కమలం, అభయ హస్తం ధరించి, ఒడిలో బాల షణ్ముఖుడైన కుమారస్వామి (స్కందుడు)తో భక్తులకు దర్శనమిచ్చారు. శేష వాహనంపై శ్రీశైల మల్లన్నతో కలిసి అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో శేష వాహనం అధిష్ఠించిన భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి వారికి ప్రధాన అర్చకులు, వేదపండితులు వాహన సేవను వైభవంగా జరిపించారు. ఉత్సవ అలంకరణలో భాగంగా స్కందమాతగా అమ్మవారు, మల్లికార్జున స్వామిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ఆస్థాన సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయ దక్షిణ మాడ వీధిలో ఏర్పాటు చేసిన కళారాధన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్యాలు, సంగీత విభావరిని భక్తులు ఆద్యంతం తిలకించారు. వేడుకలను ఆలయ ఈఓ డి. పెద్దిరాజు, అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పర్యవేక్షించారు.

శ్రీశైల మాడ వీధుల్లో కళాకారుల ప్రదర్శన

నేడు కాత్యాయని అలంకరణ

దసరా ఉత్సవాల్లో ఆరో రోజు మంగళవారం భ్రమరాంబికా అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు హంస వాహన సేవ, పుష్ప పల్లకి సేవ నిర్వహించనున్నారు.




ప్రజా సమస్యలను పరిష్కరించండి: కలెక్టర్ రాజకుమారి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్,

గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు

డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు గైర్హాజరైన వికలాంగుల శాఖ ఏడీ, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్, గనుల శాఖ అధికారి, స్కిల్ డెవలప్‌మెంట్, ఉప రవాణా అధికారులకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని డీఆర్వోను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు 90 శాతం రెవెన్యూకు సంబంధించిన భూ సమస్యలే వస్తున్నాయని అన్నారు. వీఆర్వో, ఆర్ఐ, డీటీలు డిజిటల్ కీ ద్వారా వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మారుస్తున్నారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో డీ పట్టాలు మంజూరు చేసిన వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. పేర్లు మార్చినట్టు తేలితే ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఇటీవల జరిగిన భూ బదలాయింపులో నిబంధనలు అతిక్రమించిన అధికారికి మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేసామని హెచ్చరించారు. మొత్తం 210 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలన్నీ విత్ ఇన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి : ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 7 : ప్రజల ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం నంద్యాల పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)లో ఎస్పీ జిల్లా వ్యాప్తంగా 86 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపించి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు ప్రతి సోమవారం దగ్గరలోని పోలీస్‌స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డీఎస్పీ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

పారదర్శకంగా దరఖాస్తు ప్రక్రియ

- ఎక్సైజ్ అధికారి రవి కుమార్
- జిల్లాలో 105 దుకాణాలకు 370 దరఖాస్తులు



మాట్లాడుతున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి రవి కుమార్

కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ (శిరివెళ్ల), అక్టోబరు 7: నూతన మద్యం పాలసీ దరఖాస్తు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవి కుమార్ తెలిపారు. ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఉన్న 105 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 370 దరఖాస్తులు వచ్చాయన్నారు. దేశంలోని ఏ వ్యక్తి అయినా, ఎన్ఆర్ఐలు కూడా ఈ మద్యం పాలసీ విధానానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడం ద్వారా వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు కృష్ణమూర్తి, టక్కీబాషా, ఎస్ఐలు సరస్వతి, శ్రీనివాసులు, ప్రవీణ్, సందీప్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి



బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 7: సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నంద్యాల జిల్లాలోని నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల సమస్యలను స్వయంగా బీసీ అడిగి తెలుసుకున్నారు. పలువురు వినతిపత్రాలు బీసీకి సమర్పించారు. అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో టీడీపీ కార్యాలయం కిక్కిరిసిపోయింది.

సెంచరీ కొట్టిన టమోటా

బహిరంగ మార్కెట్లో కిలో రూ.100

సంజామల/కొలిమిగుండ్ల, అక్టోబరు 7: టమోటా ధర సామాన్యుడిని బెంబేలెత్తిస్తోంది. సోమవారం బహిరంగ మార్కెట్లో కిలో టమోటా రూ.100కు చేరింది. దీంతో వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. జూలైలో సెంచరీ కొట్టిన టమోటా ఆగస్టులో సామాన్యుడికి అందుబాటులోకి వచ్చింది. కిలో రూ.10, 20కి దొరకింది. తిరిగి వారం రోజులుగా ధర పెరుగుతూ వచ్చింది. సోమవారం ఏకంగా బహిరంగ మార్కెట్లో రూ.100కి చేరడంతో వినియోగదారులు భయపడిపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయిందని, ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అదేవిధంగా కిలో ఉల్లి రూ.80, కిలో బీర రూ.80, కాకర రూ.80, క్యారెట్ రూ.80, పచ్చి మిర్చి రూ.60 ఉన్నాయి. కూరగాయల ధరలు మండిపోతుండడంతో అన్ని వర్గాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 7: జిల్లా పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లీలావతి ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు 6, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 2, ఆయా పోస్టులు 60 ఉన్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తులు సంబంధిత సీడీపీవో పనివేళలో ఈనెల 10వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని కోరారు.

ఐఆర్, 12వ పీఆర్సీ అమలు చేయాలి

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 7: ఉద్యోగులకు ఐఆర్, 12వ పీఆర్సీ అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ అమలు చేసిందన్నారు. 2022 సంవత్సరం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. విజయవాడలోని వరదలకు గురైన ప్రాంతాల్లో బాధితులకు ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగులు సహాయం చేశారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతం, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కోశాధికారి, పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, క్లాస్-4 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మల్లేశ్వరరావు, ఏఎన్ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి. సులోచనమ్మ, గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య, జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ వి.గిరికుమార్ రెడ్డి, నంద్యాల జిల్లా చైర్మన్ పి. రామచంద్రరావు పాల్గొన్నారు.

నాణ్యతగా పరిమళ ప్రసాదం

- లాభాపేక్ష లేకుండా భక్తులకు పంపిణీ
- పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మంత్రాలయం, అక్టోబరు 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి పరిమళ ప్రసాదాన్ని నాణ్యత ప్రమాణాలతో భక్తులకు అందజేస్తున్నామని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. సోమవారం ఊంజల మండపంలో పీఠాధిపతి విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయం రాఘవేంద్రస్వామి ప్రసాదం లాభాపేక్ష లేకుండా నాణ్యత ప్రమాణాలతో ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ రుచికరమైన స్ఫటిక ఆకారంలో ఉండే ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్నామన్నారు. పరిమళ ప్రసాదంలో 100 కేజీల రవ్వకు 120 కేజీల చక్కెర, 30 కేజీల నెయ్యి, 5 కేజీల జీడిపప్పు, 5 కేజీల ద్రాక్ష, 200 గ్రాముల యాలకులు, 200 గ్రాముల జాజికాయ జాపత్రి, 200 గ్రాముల కేసరి కలర్ వినియోగిస్తావనాన్నారు. 19 మంది సిబ్బందితో రోజుకు 10 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు ప్రసాదాలను తయారు చేస్తున్నామన్నారు.

ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 7: ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలలో సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర పది అంశాలపై మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు శ్రీకాళహస్తి ఐటీసీలో శిక్షణ పొందిన ఎంటీటీల ద్వారా శిక్షణ ఉంటుందన్నారు. 8,9,10 తేదీలలో జిల్లా పరిషత్ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఇచ్చే శిక్షణకు అధికారులు తప్పకుండా హాజరు కావాలని సీఈఓ పేర్కొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఓర్వకల్లు, అక్టోబరు 7: పత్తి పంట తెగుళ్లపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం డా. సుజాతమ్మ కోరారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ప్రపంచ పత్తి దినోత్సవాన్ని (వరల్డ్ కాటన్ డే) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నంద్యాల వ్యవసాయ శాఖ కర్నూలు వారిచే సంయుక్తంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఏరువాక కేంద్రం కర్నూలు శాస్త్రవేత్త డా. సుజాతమ్మ పత్తిలో అధిక దిగుబడితో పాటు పత్తి నాణ్యతను పెంచడంతో రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మోహన్ విష్ణువర్ధన్, రవిప్రకాష్, చైతన్య కుమారి, రమాదేవి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శశిధర్ రెడ్డి, ఏవో బీవీ జీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌వి స్వార్థ రాజకీయాలు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్



కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: పసిపిల్ల చనిపోతే, దానికి రాజకీయ రంగు పులిమి తన స్వార్థ రాజకీయాలకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వాడుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పుంగనూరు పర్యటన ఎందుకు రద్దు చేసుకున్నారని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం అభం.. శుభం తెలియని పసిపాపపై నీచంగా మాట్లాడిన జగన్ కుట్రను పాప తల్లిదండ్రులు తిప్పికొట్టారని అన్నారు. తిరుపతి లడ్డూ కల్తీలో తన అక్రమాలపై విమర్శలను పక్కదారి పట్టించేందుకు పసిపాను అడ్డుపెట్టుకుని నీచ సంస్కృతికి తెగబడ్డారని ఆరోపించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

మహిళ మృతి : ఇద్దరికి గాయాలు

దొర్నిపాడు, అక్టోబరు 7: మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామ సమీపంలో ఆటో, బైక్ ఢీకొనడంతో షేక్. ఉసేన్‌బీ (44) అనే మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం భీమునిపాడు నుంచి డబ్ల్యూ. గోవిందిన్నెకు ఆటోలో కూలీ పనుల కోసం మహిళా కూలీలు వెళ్తుండగా డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై చాకలి ప్రశాంత్ భీమునిపాడుకు వెళ్తుండగా డబ్ల్యూ. గోవిందిన్నె సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొనడంతో ఆటోలో ఉన్న షేక్ ఉసేన్‌బీ, మరి కొందరికి గాయాలయ్యాయి. ఉసేన్‌బీ పరిస్థితి విషమంగా ఉండటంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉసేన్‌బీ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడ్డ మరి కొందరు మహిళలు కోవెలకుంట్ల ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఉసేన్‌బీ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

బన్నీ ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న భక్తులు

హొళగుంద, అక్టోబరు 7 : రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవరగట్టు మాల మల్లేశర స్వామి బన్నీ మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైనట్లు ఆలయ పూజారులు మల్లయ్య స్వామి, మహేష్ స్వామి, మనోహర్ స్వామి సోమవారం తెలిపారు. నేరణికి గ్రామంలోని మల్లేశ్వర స్వామి దేవాలయంలో మళమ్మా, మల్లేశ్వర స్వామి విగ్రహం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో పురవీధుల్లో ఊరేగింపుగా దేవరగట్టుపై ఉన్న గిరికి గొరవయ్యలు, కంచే వీరబసవరాజు, రవి స్వామి తీసుకొచ్చినట్లు తెలిపారు. స్వామి అమ్మవారికి పూజారుల సమక్షంలో కంకణధారణ కార్యక్రమంతో బన్నీ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఈ నెల 12వ తేదీన బన్నీ ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

కాల్వబుగ్గ ఆలయంలో అవినీతి?

రూ.30 లక్షల అవినీతి... పూర్వ ఈవోపై ఆరోపణలు



కాల్వబుగ్గ రామేశ్వర ఆలయం

ఓర్వకల్లు, అక్టోబరు 7: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారి బీఆర్‌కేవీ ప్రసాద్ రూ.30 లక్షల దాకా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాగంటి క్షేత్రానికి ఈవోగా పని చేస్తూ కాల్వబుగ్గకు రెండేళ్ల ఇన్‌చార్జి ఈవోగా ప్రసాద్ పని చేశారు. మొత్తంగా ఆరు సంవత్సరాలపాటు ఇక్కడే పనిచేస్తూ ఇటీవల యాగంటి క్షేత్రానికి బదిలీ అయ్యారు. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే కాల్వబుగ్గ దేవుని మాన్యంలో మూడు విద్యుత్ టవర్లు పోయాయని, ఒక్కో టవర్‌కు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఆలయ నిధులు కేటాయించారనే చర్చ జరుగుతోంది. సదరు అధికారి ఇటీవల బదిలీల్లో భాగంగా యాగంటి క్షేత్రానికి బదిలీ కాగా, ఓర్వకల్లు ఈవోగా పని చేస్తున్న మద్దిలేటిని కాల్వబుగ్గ రెగ్యులర్‌గా ఈవోగా నియమించారు. అయితే ఆయన ఇంత వరకు పదవీ బాధ్యతలు చేపట్టలేదు. ఆరోపణలపై దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌బాబును వివరణ కోరగా మంగళవారం ఈవో ప్రసాద్‌ను పిలిపించి విచారిస్తామని, ఆ తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా కాల్వబుగ్గ ఆలయానికి రాబడి తక్కువగా ఉంటుంది. ఇలాంటి చోట భారీమొత్తంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు రావడంపై సర్వత్రా అనుమానాలువ్యక్తమవుతున్నాయి.

పోలీసు ప్రజా ఫిర్యాదుల వేదికకు 132 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి. బిందు మాధవ్

కర్నూలు, అక్టోబరు 7: స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 132 ఫిర్యాదులు వచ్చాయి.

- కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన షేక్ సాదిక్, షేక్ తస్లీమా గుంటూరు చెందిన రవిలు కలిసి తమకు బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఫేక్ లెటర్స్ ఇచ్చి ఐదుగురి నుంచి రూ.30లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు బంగారు పేటకు చెందిన దివ్యాంగుడైన మురళీమోహన్ ఫిర్యాదు చేశారు.
- పెద్దల నుంచి వంశపారంపర్యంగా వచ్చిన మూడు ఎకరాల పొలాన్ని తమ వదిన సరోజ, రిటైర్డు ఉద్యోగి రత్నస్వామి మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్నారని, తన పొలాన్ని, స్థలాన్ని ఇప్పించి న్యాయం చేయాలని గార్గేయపురానికి చెందిన దివ్యాంగుడైన దేవదానం ఫిర్యాదు చేశారు.
- జూలై 31న లొద్దిపల్లె హైస్కూల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తూ రిటైర్ అయ్యానని, ప్రభుత్వం నుంచి ఆర్డర్ కాపీ వచ్చిందని, స్కూల్‌లో పని చేస్తున్న హెడ్ మాస్టర్ ఎం.విజయభాస్కర్ పింఛన్ పత్రాలపై సంతకాలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు చెందిన రిటైర్డు ఉద్యోగి వెంకటరమణ రాజు ఫిర్యాదు చేశారు.
- ప్రైవేటుగా చిట్‌ఫండ్ పేరుతో చీటీలు వేసి 50 మంద బాధితుల నుంచి కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన తెలుగు నాగరాజు కుమారుడు దుర్గా ప్రసాద్ రూ.10 కోట్ల మేర డబ్బులు తీసుకుని ఇవ్వడం లేదని కర్నూలుకు చెందిన బాధితులు సురేష్, అశోక్, సునీల్, 12 మంది ఫిర్యాదు చేశారు.
- మొబైల్ చూస్తుంటే ఇన్‌స్టాగ్రాంలో ఆఫర్ వచ్చిందని, తక్కువ రేటుకే డ్రస్సులు, వస్తువులు వస్తాయని తన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో అప్లయ్ చేస్తుంటే నిమిషంలోనే సైబర్ నేరస్థులు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.18,800 మాయం చేశారని, న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన రిటైర్డు పోస్టుమాస్టర్ డేవిడ్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు, ఆదోని, గూడూరులలో గ్రూప్-4 ఉద్యోగాలు ఇప్పిస్తామని ముళ్ల చాంద్ మధ్యవర్తిత్వం చేసి తమ ముగ్గురు నుంచి రూ.20 లక్షలు తీసుకుని మధుసూదన్ అనే వ్యక్తి మోసం చేశాడని ఎమ్మిగనూరు, నందవరం చెందిన బాధితులు రాజు, వెంకప్ప, మురళి ఫిర్యాదు చేశారు.
- 30 మంది డిస్ట్రిబ్యూటర్లతో కర్నూలులో మసాలా వ్యాపారం చేస్తున్నానని, కంబంకు చెందిన మనోహర్ 8 నెలల పాటు కర్నూలు నుంచి మసాలాలు కొనుగోలు చేస్తున్నాడని. కొనగోలు చేసిన వాటికి రూ.25 లక్షలు తన బ్యాంకు ఖాతాలో వేయకుండానే డబ్బులు జమ చేసినట్లు ఫేక్ బ్యాంకు చలానాను పంపించి డబ్బులు తన ఖాతాకు పంపించానని మోసం చేస్తున్నాడని కర్నూలుకు చెందిన వెంకన్న ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

పత్తి వాహనం బోల్తా

ఇద్దరు హమాలీల దుర్మరణం



బోల్తా పడిన పత్తి వాహనం



కురువ జమ్మన్న (ఫైల్)



జ్ఞాన వంతుడు (ఫైల్)

కర్నూలు, అక్టోబరు 7: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని జి.సింగవరం, కొంతలపాడు గ్రామ సమీపంలో పత్తి లోడుతో ఉన్న వాహనం బోల్తా పడి కురువ జమ్మన్న (40), జ్ఞాన వంతుడు (20) హమాలీలు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గద్వాల జిల్లా వడ్డెపల్లి మండలం తిమ్మాజిపల్లెకు చెందిన సుమారు ఏడుగురు హమాలీలు పత్తి లోడు చేసేందుకు బొలేరో వాహనంలో కర్నూలు జిల్లాకు వచ్చారు. లోడు చేసేందుకు ఓ వ్యాపారి వీరిని పిలిపించారు. కోడుమూరు మండలంలో పత్తిలోడు చేసుకుని నాగలాపురం, ఉల్చాల మీదుగా రాజోలి వెళ్తున్నారు. కొంతలపాడు వద్ద దూపాడు సమీపంలో డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో ఆటో అదుపు తప్పి పక్కనున్న వంకలోకి దూసుకెళ్లింది. దీంతో పత్తి లోడుపై భాగాన కూర్చున్న హమాలీలు వాగులో పడిపోయారు. వీరిపైన పత్తి పడటంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. స్థానికులు అప్రమత్తమై ఐదుగురిని బయటకు తీశారు. మిగతా ఇద్దరు బయటకు తీసేలోపే మృతి చెందారు. జ్ఞానవంతుడు, జమ్మన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గాయపడిన వీరిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన తర్వాత ఆటో డ్రైవర్ పరారయ్యాడు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

పది క్వింటాళ్ల పత్తి దగ్ధం

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



దగ్ధమైన పత్తి

మంత్రాలయం, అక్టోబరు 7: మంత్రాలయం మండలంలోని మాదవరం గ్రామంలో చిన్న ఏసేబు ఇంట్లో నిల్వ ఉంచిన పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. సోమవారం మధ్యాహ్నం రోడ్డులో చిన్న పిల్లలు టపాకాయలు పేలుస్తుండగా.. చిన్న నిప్పురవ్వ వచ్చి నిల్వ ఉంచిన పత్తిపై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల పత్తిలో పది క్వింటాళ్ల దగ్ధం కాగా, స్థానికులు నీరు పోసి ఐదు క్వింటాళ్లను కాపాడుకున్నారు. ఆరు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసి మొదటి విడతగా తెచ్చిన పత్తి మరో రెండు రోజుల్లో అమ్మకం చేసుకునేందుకు సిద్ధంగా ఉంచిన పత్తి మంటలకు ఆహుతి కావడంతో మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాదవరం ఎస్ఐ విజయకుమార్, ఏఎస్ఐ బందెనవాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన పత్తిని అంచనా వేశారు. దగ్ధమైన పత్తికి నష్టపరిహారం అందజేసి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

దరఖాస్తులు రీ ఓపెన్ కాకూడదు

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే దరఖాస్తులపై సీఎంవో కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందని, రీఓపెన్ కాకుండా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కర్నూలు అర్బన్, ఆదోని రూరల్, దేవనకొండ, గోనెగండ్ల, కల్లూరు మండలాల్లో అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులను ప్రశ్నించారు. పత్తికొండ ఆర్డీవోకు సంబంధించి 3, డీఐజీకి సంబంధించి 3, కర్నూలు ఆర్డీవోకు సంబంధించి 1, సబ్ కలెక్టర్ ఆదోనికి సంబంధించి 1, ల్యాండ్ అండ్ సర్వేకు సంబంధించి 1, ఎస్‌డీవోకు సంబంధించి 1, ఆలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులకు 1 రీఓపెన్ అయ్యాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ 13, కర్నూలు ఆర్డీవో 9, పత్తికొండ ఆర్డీవో 2, డీఎస్‌వో 2, హౌసింగ్ 2, బీసీ సంక్షేమం 2, వ్యవసాయం 1, ఏవో కలెక్టరేట్ 1, నైపుణ్య అభివృద్ధి 1, డీపీవో 1, ఎంపీ గూడూరు 1, డీఆర్‌డీఏ పీడీ 1, ఆర్‌డబ్ల్యూఎస్ 2, డ్వామా 1, ఐసీడీఎస్ 1, పంచాయతీరాజ్ 1, ఏపీఐఐసీ 1 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్షయ, కుష్టు వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 7: క్షయ, కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓల్డ్ సీఎల్‌జీలో నోడల్ ఆఫీసర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. టీబీ లెప్రసీ వ్యాధులను 2024 నాటికి పూర్తిగా అంతం చేయడం మనందరి పంతం అన్న లక్ష్యంతో పని చేయాలని ఆదేశించారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫంతో పాటు రాత్రి పూట జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు టీబీ వ్యాధిగ్రస్తులకు ఉంటాయని తెలిపారు. ఈ కుష్టు, క్షయ వ్యాదుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డా.మల్లికార్జున రెడ్డి, డీపీఎంవో విజయ ప్రకాష్, ఉద్యోగులు ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించండి

- ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు, అక్టోబరు 7: దసరా పండుగకు ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్తున్నారా..? అయితే దొంగతనాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ జి. బిందు మాధవ్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి గ్రామాలకు వెళ్లేవాళ్లు ఇళ్లకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 9121101075 నెంబరును, లేదా స్థానిక పోలీసులను సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణాలకు పోటీ

- కర్ణాటక, తెలంగాణ నుంచి వెల్లువ
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 797 దరఖాస్తులు
- ఒక దుకాణానికి దరఖాస్తులు నిల్

కర్నూలు(అర్బన్), అక్టోబరు 7: ప్రైవేట్ మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు ఈ నెల 9తో ముగియనుంది. జిల్లాలోని 99 దుకాణాలను దక్కించుకునేందుకు తీవ్ర పోటీ ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారుల అంచనా. సోమవారం సాయంత్రానికి దాదాపు 797 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ ద్వారా 310, ఆఫ్‌లైన్ ద్వారా 450 దరఖాస్తులు అందాయి. గడువులోపు 1500 దరఖాస్తులు చేరుకునే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని ఆదోని డివిజన్ పరిధిలోని ఒక దుకాణానికి ఇంత వరకు ఒక్క దరఖాస్తు కూడా వేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లాతో పాటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోసిగి, ఎమ్మిగనూరు ప్రాంతాలకు కర్నాటక, కర్నూలు నగరంతో పాటు చుట్టు పక్కల సమీప మండలాల్లోని దుకాణాలను దక్కించుకునేందుకు తెలంగాణ ప్రాంత వ్యాపారులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. 2014-2019 మధ్య కూడా ఆయా రాష్ట్రాల వ్యాపారులే ఎక్కువ శాతం దుకాణాలు దక్కించుకుని వ్యాపారాలు కొనసాగించినట్లు ఎక్సైజ్ అధికారుల రికార్డులు సూచిస్తున్నాయి. ఆఫ్ లైన్ ప్రక్రియలో జిల్లాలోని 99 దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఆయా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద దరఖాస్తులు చేసుకుంటున్నారు. సోమవారం సాయంత్రానికి ఆన్‌లైన్ కంటే ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో రింగ్ అయి దుకాణాలను దక్కించుకోవాలని కొందరు మద్యం వ్యాపారులు ప్రజా ప్రతినిధుల వద్ద మకాం వేసి దరఖాస్తులు వేసిన వారి వివరాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, అక్టోబరు 7: మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన కురువ రాముడు (45) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. బంగ్లా ఏరియాలో నివాసముంటున్న ఆయన ఇంటి వద్ద మంచినీళ్ల మోటారు వేయడం కోసం స్విచ్ ఆన్ చేయగా కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. అతని భార్య గత కొంతకాలం క్రితం మరణించింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నన్నూరు శాఖ కార్యదర్శి మధుసూదన్ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దళిత వాడలో ఘర్షణ

- పరస్పరం కర్రలతో దాడి ● ఏడుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, అక్టోబరు 7 : ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామ దళిత వాడలో ఘర్షణ చోటు చేసుకొంది. ఉలిగమ్మ దేవాలయానికి చెట్టుకొమ్మ అడ్డుగా ఉండడంతో తొలగించడానికి సర్పంచు భర్త భీమేష్‌తోపాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. తమ ఖాళీ స్థలాన్ని అక్రమించుకోవడానికి వన్నాగం పన్నారని చిదానందతోపాటు మరికొందరు అక్కడికి వచ్చారు. ఈ క్రమంలో భీమేష్, చిదానంద వర్గాలవారు కర్రలతో కొట్టుకున్నారు. ఈ క్రమంలో ఏడుగురికి గాయాలు తగిలాయి. చిదానంద ఫిర్యాదుతో భీమేష్‌తోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- హైదరాబాదులో ఘటన

ఎమ్మిగనూరు, అక్టోబరు7: బీటెక్ చదివాక ఉద్యోగం కోసం హైదరాబాదు నగరానికి వెళ్లిన యువకుడ్ని అక్కడ రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న గురురాజు, రాజేశ్వరిలకు ఇద్దరు కుమారులు. వీరు గత కొంతకాలంగా కర్నూలులో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు జయప్రకాష్(22) బీటెక్ పూర్తి చేశాడు. అయితే స్థానికంగా ఉద్యోగాలు లేకపోవడంతో హైదరాబాదుకు చేరుకొని అక్కడ ఉద్యోగవేటలో పడ్డాడు. సోమవారం తెల్లవారుజామున బైకుపై బయటకు వచ్చాడు. ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొట్టడంతో జయప్రకాష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాదుకు బయల్దేరి వెళ్లారు. మంగళవారం ఎమ్మిగనూరులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సోమవారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. రుద్ర, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, కలశ, గణపతి, లక్ష్మీ పూజలు, పుణ్యహావాచనం తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాములపాడులో చాముండేశ్వరీదేవిగా..



జూపాడుబంగ్లాలో లలితా త్రిపురసుందరీదేవిగా..


ఆత్మకూరు రూరల్: వెంకటాపురంలో మహాచండీ దేవిగా..


పగిడ్యాల: నెహ్రూనగర్‌లో మహాచండీ దుర్గగా..


నంద్యాలలో అర్ధనారీశ్వరుడిగా..


కొత్తపల్లి: లలితాదేవి అలంకరణలో కొలనుభారతి సరస్వతి అమ్మవారు


గడివేముల: అన్నపూర్ణాదేవి అలంకారంలో..


నందికొట్కూరులో మహాచండీ దేవిగా..


ఆత్మకూరులో అన్నపూర్ణాదేవిగా..

మహానందిలో గజవాహనంపై అమ్మవారు


స్కందమాతగా కామేశ్వరీదేవి

మహానంది, అక్టోబరు 7: మహానంది క్షేత్రంలో దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కామేశ్వరీదేవిని అర్చకులు స్కందమాత దుర్గగా అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రత్యేక యాగశాల మంటపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు, రుత్వికులు ఉదయం నుంచి చండీ హోమం, పారాయణం, హోమాలతో పాటు కుంకుమార్చన పూజలను వేదమంత్రాలతో జరిపారు. సాయంకాలం 6 గంటల నుంచి అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవను వైభవంగా నిర్వహించారు. గజవాహనంపై అమ్మవారిని ఆశీనులుజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఏఈవో ఎర్రమల్ల మధు, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మహానందిలో గజవాహనంపై విహరిస్తున్న అమ్మవారు

మహానంది ఆలయ అభివృద్ధికి విరాళం


ఆలయ ఏఈవోకు విరాళం అందజేస్తున్న అప్పారావు

మహానంది, అక్టోబరు 7: మహానంది ఆలయ అభివృద్ధికి నంద్యాలకు చెందిన రావూస్ కళాశాలల అధినేత ఏఎంవీ అప్పారావు రూ. లక్ష విరాళాన్ని అందచేసినట్లు ఏఈవో ఎర్రమల్ల మధు తెలిపారు. సోమవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో దాత రూ.లక్ష నగదును అందజేయగా.. స్వామి వారి శాలువాతో సన్మానించి బాండు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సహాయ అర్చకుడు జనార్దన్‌శర్మ ఉన్నారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన


దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

నందికొట్కూరు, అక్టోబరు 7: దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న జమ్మిచెట్టు దగ్గర దసరా ఏర్పాటు చేస్తున్న పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విజయదశమి రోజున జమ్మిచెట్టు వద్దకు వచ్చే జనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ బేబీకి సూచించారు. కార్యక్రమంలో 5వ వార్డు ఇన్‌చార్జి టీడీపీ నాయకులు అబ్దుల్లా, విజయదశమి ఉత్సవ కమిటీ సభ్యులు శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఖోఖో సౌత్ జోన్ ఇండియా లీగ్ మ్యాచ్‌కు ఎంపిక

ఆత్మకూరు, అక్టోబరు 7: ఆత్మకూరు పట్టణంలోని శ్రీపద్మావతి హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న హారిక అనే విద్యార్థిని ఖోఖో క్రీడలో సౌత్‌జోన్ ఇండియా లీగ్ మ్యాచ్‌కు ఎంపికైనట్లు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి. ఆశ సోమవారం తెలిపారు. ఈ నెల 5వ తేదిన ఒంగోల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీల్లో హారిక ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబరు 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జరిగే జాతీయ ఖోఖో పోటీలకు హారిక హాజరుకానున్నట్లు వివరించారు. ఇదేస్ఫూర్తితో జాతీయ క్రీడల్లో కూడా హారిక రాణించాలని ఆమె ఆకాంక్షించారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారిణి హారికను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముర్తుజా, సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

బహిరంగ వేలం పాటలు

గడివేముల, అక్టోబరు 7: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో టెంకాయలు, టీ, మిఠాయిలు అమ్ముకునేందుకు సోమవారం వేలం పాటలు నిర్వహించగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.9 వేలు ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వీఎల్ఎన్ రామానుజన్ తెలిపారు. పర్యవేక్షణాధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించగా టెంకాయలు, టీ, మిఠాయి దుకాణాలను నిర్వహించుకునేందుకు రూ.2.43 లక్షలు వేలం పాట పాడారని అన్నారు. గత ఏడాది రూ.2.34 లక్షలు రాగా ఈ ఏడాది అదనంగా రూ.9 వేలు ఆదాయం పెరిగిందని కార్యనిర్వాహణాధికారి చెప్పారు.

నేటి నుంచి తిక్కయ్య స్వామి ఉరుసు


హజరత్ సయ్యద్‌హబీవుల్లాషా ఖాద్రి దివాన్‌షావలి జీవసమాధి

ఆత్మకూరు, అక్టోబరు 7: పట్టణంలోని తిక్కయ్యస్వామి (హజరత్ సయ్యద్ హబీవుల్లాషా ఖాద్రి దివాన్‌షావలి) దర్గాలో 70ఏళ్లుగా ఉరుసు మహోత్సవంగా ఎంతో సంప్రదాయంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన సయ్యద్‌అహ్మద్‌హుసేన్ కుటుంబీకులు తరతరాలుగా తిక్కయ్యస్వామిని ఆరాధిస్తూ.. వేడుకను వైభవంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవంలో భాగంగా తొలిరోజైన మంగళవారం గంధం సందర్భంగా స్వామిజీ సమాధికి తలభాగంలో గంధం పూసి ఉత్సవాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత రెండో రోజైన బుధవారం ఉరుసు వేడుకను పురస్కరించుకుని సమాధికి విశేష పూజలు నిర్వహిస్తారు. చివరి రోజైన గురువారం జియారత్ పాతేహ సందర్భంగా స్వామిజీకి అంత్యపూజలు చేపట్టి ఉత్సవానికి ముగింపు పలుకుతారు. ఆత్మకూరు పరిసర మండలాలతో పాటు హైద్రాబాద్, నెల్లూరు, కడప, గద్వాల, ఆళ్లగడ్డ, మైదుకూర్, నంద్యాల, మహానంది తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివస్తారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి

నంద్యాల రూరల్, అక్టోబరు 7: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో ప్రభుత్వ ఆధ్వర్యంలో నంద్యాల, గోస్పాడు మండల రైతులకు రాయితీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలను వైసీపీ నేతలు వదలడం లేదని అన్నారు. గత వైసీపీ పాలనలో ప్రజాసేవ అంటూ శిల్పాసహకార్, శిల్పా మహిళాబ్యాంక్ పేరుతో ప్రభుత్వ భవనాలను అద్దెప్రాతిపాదికన తీసుకుని గడువు ముగిసినప్పటికీ వదలక పోవడంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ఖాళీ చేసి నిజాయితీని చాటుకోవాలని సూచించారు. అక్కడే వేదికపై ఉన్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డిని ప్రభుత్వ స్థలాలలో మార్క్‌ఫెడ్ కార్యాలయం ఏర్పాటు చేసుకుని రైతులకు అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనగ విత్తనం పూర్తి ధర రూ.9400 కాగా 25 శాతం సబ్సిడీ పోగా రూ.7050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం తులసీరెడ్డి మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు అన్ని విధాల సహకరిస్తామన్నారు. త్వరలో గోనె సంచులను కూడా సరఫరా చేయనున్నట్లు తెలిపారు.


రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

అధికారుల పనితీరుపై మంత్రికి ఫిర్యాదు

నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ పనితీరుపై ఊడుమాల్పురం గ్రామానికి చెందిన రైతు లోకేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడంతో కాక మంత్రికి ఫిర్యాదు చేశారు. గత పాలనలో జొన్నలు కొందరివి మాత్రమే కొనుగోలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల మంజూరులో అడ్డంకులు సృష్టించారన్నారు. మార్క్‌ఫెడ్ కార్యాలయంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బ్రహ్మానందరెడ్డి జొన్నల కొనుగోలులో కలిగించిన అవరోధాలను గోస్పాడు మండలం ఎం.క్రిష్ణాపురం గ్రామానికి చెందిన రైతు బాలీశ్వరరెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. బ్రహ్మానందరెడ్డిని సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, టీడీడీ నంద్యాల, గోస్పాడు మండలాల కన్వీనర్లు విశ్వనాథరెడ్డి, తులసీశ్వరరెడ్డి, నంద్యాల మండల ప్రధాన కార్యదర్శి మండ్ల గుర్రప్ప, నంద్యాల, గోస్పాడు ఏవోలు ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యతోనే చెంచుల జీవితాల్లో మార్పు: ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, అక్టోబరు 7: విద్యతోనే చెంచుల జీవితాల్లో మార్పు వస్తుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెంచుల నివాసాల్లో వర్షపునీరు కారుతూ ఇబ్బందులు పడుతుండటంతో శ్రీశైలంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా నాగలూటి చెంచుగూడెంలో చెంచులకు సోమవారం టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెంచులు తమ జీవన ప్రమాణాలను మరింత మెరుగుపర్చుకోవాలని, ఇందుకు తాను అన్నివిధాలుగా సహకారాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు. నాగలూటి చెంచుగూడేంలో చెంచులకు సరైన నివాసాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రావడంతో తాత్కాలికంగా టార్పాలిన్లను అందజేస్తున్నట్లు వివరించారు. అంతకుముందు నాగలూటిలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సురేష్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ కేజీనాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, కొండలరావు, రవినాయక్, రవీంద్రబాబు, వెంకట్రావ్, దగ్గుపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.


టార్పాలిన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

'తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'


మాట్లాడుతున్న తపాలాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ఆత్మకూరు, అక్టోబరు 7: తపాలాశాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. తపాలాశాఖ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక పోస్టాఫీసులో తపాలా శాఖ సేవల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. పోస్టల్ సేవలు, పొదుపు, బీమా సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తపాలాశాఖలోని పొదుపు, ఇన్సూరెన్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రత్యేకించి ఉత్తర, ప్రత్యుత్తరాల విషయంలో ఎలాంటి అంతరాయం లేకుండా సౌకర్యవంతమైన తపాలా సేవలను తాము అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం పోస్టాఫీసు ద్వారా భారీగా పోస్టులు పంపించే మేథా ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు వెంకటేశ్వర్లుతో ఆయన మాట్లాడి వారికి అందుతున్న పోస్టల్ సేవల గురించి ఆరా తీశారు.

'డిగ్రీ స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోండి'

ఆత్మకూరు, అక్టోబరు 7: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 7 నుంచి 9 తేది వరకు డిగ్రీ స్పాట్ అడ్మిషన్స్ పొందేందుకు అవకాశం ఉందని, అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వై.జిష్ణు నాగ్ విజయ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్), బీఎస్సీ (జువాలజీ సింగిల్ మేజర్), బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (పొలిటికల్ సైన్స్) గ్రూపులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులకు, విద్యార్థులకు విడివిడిగా కళాశాల ప్రాంగణంలోనే వసతి సదుపాయం ఉన్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తైన విద్యార్థులు టీసీ, ఇంటర్, ఎస్ఎస్‌సీ మార్క్సు మెమో, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డు వివరాలతో హాజరు కావాలని తెలిపారు.

'అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి'

గడివేముల, అక్టోబరు 7: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగే పబ్లిక్ గ్రీవెన్స్‌డేకు ఎమ్మెల్యే గౌరు చరిత హాజరవుతారని, అధికారులందరూ తప్పనిసరిగా ఎంపీడీవో వాసుదేవగుప్త తెలిపారు.ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'గిరిజనుల అభివృద్ధే లక్ష్యం'


గిరిజనులతో మోమిన్ షబానా

ఆత్మకూరురూరల్, అక్టోబరు 7: దేశ వ్యాప్తంగా ఉన్న గిరిజనుల అభివృద్ధి కోసమే పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మైనారిటీ మోర్చా శ్రీశైలం నియోజక వర్గ కోఆర్డినేటర్ మోమిన్ షబానా అన్నారు. మండలంలోని బైర్లూటి గూడెంలో, ముర్తుజావలి దర్గా ప్రాంతంలో సోమవారం పర్యటించి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన తెగల్లో వెనకబడిన ప్రాంతాలను గుర్తించి వారికి మౌలిక సదుపాయాలు, పక్కా ఇళ్ల నిర్మాణాలు, ఇంటింటికి విద్యుత్, అంగన్‌వాడీ, స్కూళ్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసి గిరిజనులకు లబ్ధి కలిగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'


డీటీకి వినతి పత్రం అందిస్తున్న రైతులు, నాయకులు

పాములపాడు, అక్టోబరు 7: ఇటీవల అకస్మాత్తుగా కురిసిన వర్షాలకు ఆరబోసిన మొక్కజొన్న పంట కొంత తడిసి, మరికొంత కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని వేంపెంట గ్రామ రైతులు కోరారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబుకు, ఏవో ఫణీశ్వరరెడ్డికి వినతి పత్రాలు అందించారు. రైతులు మాట్లాడుతూ గత శనివారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షం కారణంగా గ్రామ శివార్లలోని చిట్టడవి బయలు ప్రదేశంలో ఆరబోసిన మొక్కజొన్న పంట గింజలు తడిసి ముద్దయ్యాయని చెప్పారు. ఈ తడిసి రంగు మారిన దాన్యాన్ని మద్దతు ధర ప్రకారం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

శ్రీశైలం ఈవోగా పెద్దిరాజు కొనసాగింపు

శ్రీశైలం, అక్టోబరు 7: శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కలెక్టర్ డి. పెద్దిరాజును కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జరీచేసింది. గత సంవత్సరం సెప్టెంబరు మాసంలో శ్రీశైలం దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ డి. పెద్దిరాజు బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో డిప్యూటేషన్ కింద ఏడాదిపాటు నియమించారు. ప్రస్తుతం ఆయన సర్వీసును తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ అయ్యాయి.



వరద బాధితులకు విరాళం


మంత్రికి చెక్కును అందజేస్తున్న ప్రిన్సిపాల్ మురళి


విరాళం ఇస్తున్న మధుసూదన్

నంద్యాల రూరల్, అక్టోబరు 7: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని న్యూక్లియస్ కళాశాల తమ వంతుగా రూ.1,10,000 సాయంగా ప్రకటించింది. సోమవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు అందజేశారు. మంత్రి ఫరూక్ వరద బాధితులకు సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. న్యూక్లియస్ కళాశాల ప్రిన్సిపాల్ మురళి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ఫయాజ్, కళాశాల డైరెక్టర్ వాసుదేవరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- అలాగే నంద్యాలకు చెందిన ఎరువుల వ్యాపారి దియ్యాల మధుసూదన్ రూ.51,000 చెక్కును మంత్రికి అందజేశారు. నంద్యాలలో విత్తనాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రికి చెక్కును అందించారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు

నంద్యాల రూరల్, అక్టోబరు 7: పట్టణంలోని గురురాజ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 42వ సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి చాంపియన్ క్రీడలు రెండోరోజు హోరాహోరీగా కొనసాగాయి. ఈనెల 6న ప్రారంభమైన పోటీలలో సోమవారం జరిగిన బాలుర టీంలో గుజరాత్‌పై కర్ణాటక విజయం సాదించింది. ఒడిశా జట్టుపై హిమాచల్‌ప్రదేశ్ జట్టు 4-3 తేడాతో విజయం సాధించింది. బాలికల మధ్య జరిగిన పోటీలలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌పై ఢిల్లీ జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ప్రీప్ క్వాటర్స్ ఫైనల్‌లో తెలంగాణ, చండీగడ్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, హిమాచలప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బాలుర విభాగంలో రాజస్థాన్, బీహర్, తెలంగాణ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జమ్మూకాశ్మీర్, తమిళనాడు, మహారాష్ట్ర, చండీఘడ్, చత్తీస్ఘడ్, కర్ణాటక, జట్టు ఫైనల్‌కు చేరుకున్నట్లు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, గురురాఘవేంద్ర బ్యాకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి క్రీడాడాకారులను పరిచయం చేసుకుని స్నేహభావంతో మెలగాలని సూచించారు.

'నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చు'


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు

జూపాడుబంగ్లా, అక్టోబరు 7: నిర్భయంగా ఎవరైనా మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు అన్నారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నందికొట్కూరు అబ్కారీశాఖ పరిధిలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు మండలాల పరిధిలో 10 దుకాణాలు ఉండగా, ఇప్పటికి 17 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈనెల 9వరకు గడువు ఉందని, ఎవరైనా, ఏ రాష్ట్రానికి చెందినవారైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రలోభాలకు గురిచేస్తారని భయపడొద్దని, అబ్కారీశాఖ రక్షణ కల్పిస్తుందని చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం సులభతరంగా చేసుకునేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం నందికొట్కూరు అబ్కారీశాఖ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ, అబ్కారీశాఖ ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన టీడీపీ నాయకులు


ఎంపీడీవో కలిసిన టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, అక్టోబరు 7: బదిలీల్లో భాగంగా జూపాడుబంగ్లా మండలానికి వచ్చిన ఎంపీడీవో గోపికృష్ణను టీడీపీ నాయకులు సోమవారం కలిశారు. మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్, సర్పంచులు నాగిరెడ్డి, బాలమద్దిలేటి, నాయకులు వీరారెడ్డి, లక్ష్మన్నగౌడు, గోవిందు, అహ్మద్ తదితరులు పాల్గొని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న కేశన్నగౌడ్

డోన్, అక్టోబరు 7: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు రూ.5 లక్షల చెక్కు విరాళాన్ని అందజేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్లకు చెక్కును అందజేశారు. ఇటీవల కేశన్నగౌడు ఆధ్వర్యంలో కొండపేట, చిగురుమానుపేటలలో విజయవాడ వరద బాదితుల కోసం విరాళాలను సేకరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సేకరించిన విరాళం రూ.5 లక్షల మొత్తాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే కోట్లకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

● దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాలలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట్రికే హరికిషన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోట్లకు స్వాగతం పలికారు.

నిధులు మంజూరు

ఉయ్యాలవాడ, అక్టోబరు 7: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు ఉపాధిహామీ నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.93 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. పెద్దయమ్మనూరు పంచాయతీకి రూ.5 లక్షలు, అల్లూరుకు రూ.7 లక్షలు, సర్వాయిపల్లె, సుద్దమల్ల, రూపనగుడి, బోడెమ్మనూరు గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున, మాయలూరు, ఇంజేడు, ఆర్.జంబుదిన్నె, పుచ్చకాయలపల్లె, ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాలకు రూ.15 లక్షల చొప్పున, ఉయ్యాలవాడకు రూ.28 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 7: మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలకు నూతన కార్యదర్శులను నియమించినట్లు ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుచ్చకాయపల్లె గ్రామ కార్యదర్శిగా చిన్నమౌళాలి, తుడుమలదిన్నె కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఇంజేడు కార్యదర్శిగా మారుతి, కొండుపల్లెకు సుమిత్ర, మాయలూరుకు దివాకర్‌రెడ్డి నియమితులయ్యారని చెప్పారు.

ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి

శిరివెళ్ల, అక్టోబరు 7: శిరివెళ్లలో నెలకొన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్‌ను మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అశ్విన్ కుమార్‌ను వారు సోమవారం కలిసి గ్రామంలోని వసతులు, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. 5వ వార్డు మెంబర్ తిరుమల రవి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

● సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను శిరివెళ్ల జనసేన నాయకులు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అశ్విన్ కుమార్‌కు సోమవారం అందజేశారు. గ్రామంలోని జకాతి కాల్వ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. జనసేన మండల కన్వీనర్ పసుల నరేంద్ర యాదవ్, పెసరాయి చాంద్‌బాషా, నాగరాజు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలు కనుమరుగవడం బాధాకరం



పోటీలను ప్రారంభిస్తున్న రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 7: గ్రామీణ క్రీడలు కనుమరుగవడం బాధాకరమని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన టెన్నిస్,బాల్, క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రుద్రవరం, అక్టోబరు 7: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హరిజగదీష్‌యాదవ్ (20) ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ వర ప్రసాద్ సోమవారం తెలిపారు. మండలంలోని తిప్పారెడ్డిపల్లె, నరసాపురం గ్రామాల మధ్య ఈ నెల 4న రెండు మోటరు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ హరి జగదీశ్‌యాదవ్ చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి తండ్రి రాధాకృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 7: పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆళ్లగడ్డ పోలీసులు తెలిపిన వివరాలివీ.. చింతకుంట్ల గ్రామానికి చెందిన దూదేకుల పీర్‌షా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పీర్‌షాను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో క్షతగాత్రున్ని కర్నూలుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు. పీర్‌షా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు

● మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లెలోని వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 7: ప్రభుత్వం సబ్సిడీపై అందించే శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో సబ్సిడీపై రైతులకు అందించే శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకర్గంలోని 5 మండలాలకు 12,111 క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కోవెలకుంట్ల డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ సుధాకర్, బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్, సంజామల మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి తీరని లోటు

సంజామల7: సంజామల సీనియర్ టీడీపీ నాయకుడు కోడూరుపెద్దపుల్లయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పెద్దపుల్లయ్య మృతి విషయం తెలుసుకొని మృతి చెందిన సమయానికి రాలేకపోయి సోమవారం మధ్యాహ్న నివాస గృహానికి చేరుకొని పెద్దపుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పుల్లయ్య సతీమణి మాజీ సర్పంచ్ కోడూరు నాగేశ్వరమ్మ, కుమారుడు శ్రీకాంత్, తమ్ముడు చిన్నపుల్లయ్యలను పరామర్శించారు. కార్యక్రమంలో తోట శ్రీనివాసరెడ్డ, తోట చెలమారెడ్డి, టీడీపీమండల ఇంచార్జి బత్తుల వెంకట ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్కిహుసేన్, తోకల మద్దిలేటి, మాధవ, సానెం రవి, హజరత్, వినాయక చిన్న, తదితరులు పాల్గొన్నారు.

పులి ప్రకాశ్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

కొలిమిగుండ్ల: మండలంలోని గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు పులి ప్రకాశ్‌రెడ్డి కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి పరామర్శించారు. గత మూడు రోజుల క్రితం సీనియర్ నేత, పులి ప్రకాశ్‌రెడ్డి తండ్రి పులి తిమ్మారెడ్డి మృతి చెందారు. దీంతో ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ సీనియర్ నేత ఐవీ పక్కీరారెడ్డి, మంత్రి వ్యక్తిగత పీఏ మురళీధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో క్యాంపు కార్యాలయ ప్రారంభ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

డోన్, అక్టోబరు 7: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారనీ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కోట్ల నివాసం పక్కన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. సీఎం చంద్రబాబు వచ్చిన తర్వాత రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుంటూ వాటికి పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నూతన ఒరవడిని తీసుకువచ్చిందన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఓంప్రకాష్, రామిరెడ్డి, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 7 : పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని మండల ఎమ్మార్పీస్ నాయకులు కోరారు. సోమవారం ఎమ్మార్పీస్ మండల అధ్యక్షులు క్రిష్ణయ్య, బాల కంబయ్య, వెంకటన్న, ఓబులేసు, నరసింహుడు తదితరులు నూతన తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని కలిసి సత్కరించారు. ఇంటి స్థలాల మంజూరు, ఇతర ప్రభుత్వ పథకాల్లో పేద ప్రజలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు బాల హుసేని, బాల పుల్లయ్య తదితరులు కోరారు.

అనాథ మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 7: కోవెలకుంట్ల పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయం వద్ద ఓ అనాథ (65) మృతి చెందాడు. కోవెలకుంట్ల పట్టణంలో కొంతకాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తుండేవాడు. అయితే ఆదివారం రాత్రి మార్కెట్ యార్డు కార్యాలయంలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఆచూకీ కోసం ఎంత వెదికినా సమాచారం లేకపోవడంతో పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ సభ్యులు విక్కీ, గోపిరెడ్డిలు అనాథశవానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, అక్టోబరు 7: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరమ్మ (45) విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. దస్తగిరమ్మ కుమారుడు ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె కుమారుడ్ని తలచుకుంటూ తీవ్ర మనస్తాపంతో జీవిస్తోంది. ఇటీవల జీవితం మీద విరక్తి కలిగి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఆమె మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి భర్త కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి'

ఉయ్యాలవాడ, అక్టోబరు 7: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో చేపడుతున్న టెండర్ల పక్రియకు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ తక్రీబాషా సూచించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 11 మద్యం షాపులు ఉన్నాయని, వీటికి టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెబ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ నాయక్ ఉన్నారు.

సర్వే నిర్వహించాం



హద్దుల వివరాలు జాకీర్‌ను వివరిస్తున్న డీఐఓఎస్‌లు చంద్రశేఖర్, సురేష్

బేతంచెర్ల, అక్టోబరు 7 : పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో ఉన్న గాడు బావి సమీపంలో ఉన్న 413, 416 సర్వే.నెంబర్లకు సంబంధించిన హద్దులు చూపించాలని కలెక్టర్‌కు జాకీర్ ఫిర్యాదు చేయడంతో ఈ సర్వే నిర్వహించామని డీఐవోఎస్‌లు చంద్రశేఖర్, సురేష్ తెలిపారు. సోమవారం ఈ రెండు సర్వే.నెంబర్లకు సంబంధించిన స్థలాలు అడంగల్‌లో తహసీల్దార్ వద్ద ఉంటాయని, తహసీల్దార్‌ను సంప్రదించి స్థలాల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. సర్వేలో మండల సర్వేయర్ నాగరాజు నాయక్, గ్రామ సర్వేయర్లు స్వాతి, హరి, వినోద్, మంజు, రాఘవలతో పాటు ఆంజనేయస్వామి దేవాలయ కమిటి పెద్దలు, ముస్లింలు మండల ఖాజీ నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికే ప్రభుత్వ లక్ష్యం

బేతంచెర్ల, అక్టోబరు 7 : పట్టణంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఫజల్ రెహిమాన్ సూచించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజా వేదిక అధికారులు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ ప్రజల సమస్యల పై రెండు దరఖాస్తులు అందాయని తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు.

సిమెంటు రోడ్డు ఏర్పాటుకు చర్యలు

డోన్(రూరల్), అక్టోబరు 7: మురికి ప్రదేశాలను గుర్తించి సిమెంటు రోడ్డు కాలువలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ వైవిధ్య తెలిపారు. కొత్తపల్లి గ్రామ ప్రధాన రోడ్డు పక్కల మురికి ప్రదేశాల్లో సోమవారం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని వేశారు. సిమెంటు రోడ్డు, కాలువ ఏర్పాటుకు పనులు చేపడుతామని సర్పంచ్ తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

బనగానపల్లె, అక్టోబరు 7: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి హెచ్చరించారు. సోమవారం బనగానపల్లెలోని స్కూల్ గ్రౌండ్‌లో ప్రైవేటు పాఠశాలల వాహనాల డ్రైవర్లకు సీఐ అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ స్కూల్ బస్సుల వాహనాలు నడిపే వారు మద్యం సేవించి నడపరాదని, సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ నడపరాదని, చిన్నపిల్లలను పుట్‌బోర్డులపై నిలబెట్టరాదన్నారు. గతంలో రోడ్డు ప్రమాదాల్లో నష్టపోయిన బాధితకుటుంబాలకు సంబంధించి వీడియోలను చూపించి సూచనలు చేశారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లు నడిపే వాహనదారులు సీట్‌బెల్టు పెట్టుకోవాలని సూచించారు.

'వైసీపీ హయాంలో పంచాయతీలు నిర్వీర్యం'



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 7: గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలోనే గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని టీడీపీ ఆళ్లగడ్డ మండల కన్వీనర్ శీలం హరి కుమార్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించి మంచి చేస్తుంటే వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, ఆయన అనుచరులు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియపై ఆరోపణలు చేయడం హేయమని అన్నారు. గత పాలనలో ఆళ్లగడ్డలో వైసీపీ నాయకులు ఇసుకను ఇష్టారాజ్యంగా పక్కదారి పట్టించి భారీగా సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. మినుము రైతులకు అందాల్సిన నష్ట పరిహారాన్ని మాజీ ఎమ్మెల్యే గుట్టుచప్పుడు కాకుండా కాజేశారన్నారు. అహోబిలం అభివృద్ధి విషయంలో భూమా కుటుంబం చిత్తశుద్ధితో ఉందన్నారు. దౌర్జన్యాలు, కబ్జాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వైసీపీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కకుండా ప్రజలు గుణపాఠం నేర్పినా వారిలో చలనం కలగడం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగం భరత్ కుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చాంద్ బాషా పాల్గొన్నారు.

ఆలయానికి టేకు రథం



టేకు రథాన్ని అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, అక్టోబరు 7: మండలంలోని ముత్యాలపాడు కన్యకాపరమేశ్వరి ఆలయంలో రూ.2.70 లక్షలు విలువ చేసే టేకు రథాన్ని కమిటీ సభ్యులకు సోమవారం వితరణ చేశారు. ముడియం బాలయ్య ధర్మపత్ని ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు ఆలయానికి విరాళంగా టేకు రథాన్ని అందజేశారు. ముడియం గోపాలకృష్ణ రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నరసింహరావు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలకృష్ణ, వెంకటరమేష్, కోశాధికారి మాధవ నరసింహయ్య పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



అఖిలప్రియను ఆహ్వానిస్తున్న ఆలయాల అధ్యక్షుడు, టీడీపీ నాయకులు

చాగలమర్రి, అక్టోబరు 7: చాగలమర్రి గ్రామంలోని వాసవీ మాత, చెన్నకేశవ ఆలయాల్లో నిర్వహించే దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడులను ఆహ్వానించినట్లు ఆలయాల అధ్యక్షులు లక్ష్మణబాబు, వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. వారిని కలుసుకొని ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ అధ్యక్షుడు సుంకు జనార్థన్, బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, దూదెకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాష, ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రమేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, అక్టోబరు 7: అడవుల సంరక్షణ అందరి బాధ్యతని డి.వనిపెంట సెక్షన్ అధికారి రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని భైరవగుండాల వద్ద వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తే హాని చేయవద్దని, అటవీ సిబ్బందికి సమాచారం తెలియజేయాలని సూచించారు. అనుమతి లేనిదే అడవిలోకి వెళ్లరాదని అన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది మదనగోపాల్, సుభాష్, ప్రొటెక్షన్ వాచర్లు నరసింహ, చెంచులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలి

చాగలమర్రి, అక్టోబరు 7: రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాష కోరారు. సోమవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేరివిజన్ కమీషన్‌ను ఏర్పాటు చేసి తీపికబురు అందించాలని అన్నారు. 11వ పీఆర్సీలో ఎంతో అన్యాయం జరిగిందని, డమ్మి పీఆర్సీ కమీషన్ వేసి గత ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. 12వ పేరివిజన్ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని నిరూపించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయికి గ్రామీణ విద్యార్థి ఎంపిక

చాగలమర్రి, అక్టోబరు 7: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఫరీద్‌బాష రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ సోమవారం తెలిపారు. ఈనెల 1న జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థి ఫరీద్‌బాషాను చైర్మన్ గౌస్‌మోహిద్దిన్, హెచ్‌ఎం కోటయ్య అభినందించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాక్షించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



గ్రామాల్లో పర్యటిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

కొలిమిగుండ్ల, అక్టోబరు 7 : మండలంలో వివిధ గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఏఎస్ఐ గోవిందనాయక్, కానిస్టేబుళ్లు మహబూబ్‌వలి కొలిమిగుండ్ల, బెలుం గ్రామాల్లోని పలువురు నాటుసారా విక్రయదారుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

చాగలమర్రి, అక్టోబరు 7: మండలంలోని చింతలచెరువు భైరవగుండాల సమీపంలోని తెలుగుగంగ కాలువలో కడప జిల్లా మైదుకూరుకు చెందిన నరేష్ (34) అనే వ్యక్తి ఈనెల 6న గల్లంతయ్యాడు. ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గజ ఈతగాళ్లు, పోలీసులు తెలుగుంగ కాలువ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నవంగలి సమీపంలోని నంద్యాల జిల్లా కడప జిల్లా సరిహద్దువద్దగల గేట్ల వద్ద మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశామని ఎస్ఐ చెప్పారు. నరేష్ తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వివిధ రూపాల్లో అమ్మవారు

దసరా వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. 5వ రోజు సోమవారం అమ్మవారి ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతులు, అర్చనాది సహస్రనామావళి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.



నందవరంలో స్కందమాత అలంకారంలో చౌడేశ్వరీమాత



యాగంటిలో అన్నపూర్ణేశ్వరిదేవిగా అమ్మవారు



చాగలమర్రిలో...



బేతంచెర్లలో గాయత్రీదేవి అలంకరణలో వాసవీ మాత



ఎగువ అహోబిలంలో తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయినిపేటలో అన్నపూర్ణదేవిగా..



అవుకులో అన్నపూర్ణేశ్వరిదేవి అలంకారంలో ..



రుద్రవరంలో గౌరీదేవి అలంకారంలో...



ప్యాపిలిలో లలితాదేవి అంకరణలో వాసవీమాత



కోవెలకుంట్లలో సంతాన లక్ష్మి అలంకారంలో శ్రీవాసవీ మాత



చాగలమర్రిలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు